క్లుప్తంగా

విజేతలకు బహుమతులు అందజేత



గుంటూరు వెస్ట్: ఆడబిడ్డ ప్రాధాన్యం అనే అంశంపై ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలకు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి బహుమతులు అందజేశారు. డి.హేమ మణికంఠ, కె.కోమలి, షేక్ బీబీ ఆయేషాలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు. దీంతో పాటు నగదు బహుమతులు కూడా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఏ శ్రావణ్ బాబు, నోడల్ అధికారి డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ సిహెచ్.రత్న మన్‌మోహన్ పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు చెక్కుల పంపిణీ

నగరంపాలెం: గత నెల్లో ఏఆర్ విభాగంలో విధులు నిర్వర్తించే బీఎస్ఆర్కే ప్రసాద్, పి.చెన్నకేశవరావు వివిధ కారణాలతో మృతి చెందారు. ఈ మేరకు ఫ్లాగ్/ విడో ఫండ్‌ల కింద ఒక్కొక్కరికి మంజూరైన రూ.75,000 చెక్కులను వారి కుటుంబ సభ్యులకు మంగళవారం డీపీఓ ఆవరణలో ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ(పరిపాలన), డీపీఓ మినిస్టీరియల్ సిబ్బంది రమాదేవి పాల్గొన్నారు.

26న సంగీత కళావేదిక వార్షికోత్సవం

పాత గుంటూరు: భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వార్షికోత్సవం ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి అనంతరం ఎంఈఓ చీకటి రవికాంత్‌కు ఉత్తమ ఎంఈఓ పురస్కారం, డాక్టర్ కోనేరు సుధాకర్‌కు ఎన్‌టీఆర్ జీవిత సాఫల్య పురస్కార ప్రదానం చేయనున్నట్లుపేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

నేటి నుంచి తాగునీటి సరఫరాకు అంతరాయం

నెహ్రూనగర్: తాగునీటి పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనుల వలన గోరంట్ల, నగరాలు ప్రాంతాలకు ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెహ్రూ నగర్ రిజర్వాయర్ నుంచి సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద పాత లైన్ నుంచి నూతన లైన్‌కు ఇంటర్ కనెక్షన్ పనులు బుధవారం చేపట్టనున్న దృష్ట్యా సరఫరాలో ఇబ్బందులు ఉంటాయని చెప్పారు. ప్రత్యేకంగా వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. ట్యాంకర్లు కావల్సిన వారు 98499 08397కు కాల్ చేయవచ్చని కోరారు.

24 వరకు సంజీవయ్యనగర్ రైల్వే గేటు మూసివేత



నెహ్రూనగర్: సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద పైపులైన్ ఇంటర్ కనెక్షన్ పనుల వలన ఈ నెల 24వ తేదీ వరకు సంజీవయ్యనగర్ రైల్వే గేటు మూసి వేశారు. నెహ్రూనగర్ నుంచి సంజీవయ్య నగర్‌కు వెళ్లే వాహనాలు మూడు వంతెనల మీదుగా, రెడ్డిపాలెం నుంచి వచ్చే వాహనాలు శారదా కాలనీ మెయిన్ రోడ్ మీదుగా వెళ్లేలా ట్రాఫిక్ మళ్లించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని, నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా చేపట్టిన పైప్ లైన్ ఇంటర్ కనెక్షన్ పనులకు నగర ప్రజలు సహకరించాలని కమిషనర్ కీర్తి చేకూరి కోరారు.

నేడు కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూలు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ బోధించేందుకు కెమిస్ట్రీ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు బుధవారం ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతానికి పైగా మార్కులు కలిగి ఉండటంతో పాటు నెట్, సెట్, ఎంఫిల్, పీహెచ్‌డీ అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని, ఆసక్తి గల వారు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

నేడు తపస్సుకాల ప్రార్థనలు ప్రారంభం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బాల ఏసు దేవాలయంలో బుధవారం నుంచి తపస్సు కాల ప్రార్థనలు ప్రారంభించనున్నట్లు దేవాలయ విచారణ గురువులు పామిశెట్టి బాలస్వామి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి విభూధిని అందజేస్తామన్నారు.

బహుళ అంతస్తులకు నిబంధనలు తప్పనిసరి

కమిషనర్ కీర్తి చేకూరి



బిల్డింగ్ కొలతలను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో నూతన బహుళ అంతస్తు నిర్మాణాలకు లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్(ఎల్.టి.పి.)లు తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలతోనే డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం(డి.పి.ఎం.ఎస్) అప్ లోడ్ చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి హెచ్చరించారు. మంగళవారం ఇన్నర్ రింగ్ రోడ్, వికాస్ నగర్, శ్యామల నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్‌టీసీకి దరఖాస్తు చేసుకున్న భవనాలను లేజర్ మెజరింగ్ మెషిన్ ద్వారా కొలతలు పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తదుపరి అనుమతులపై తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. భవన నిర్మాణదారులు కూడా ఎల్.టి.పి.లను నిబంధనలకు అనుగుణంగానే దరఖాస్తు చేయాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా అప్ లోడ్ చేసే ఎల్.టి.పి.ల లైసెన్స్ రద్దుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగానే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని, లేని వాటిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ ఇవ్వడం జరగదన్నారు. రెయిన్ వాటర్ హార్వెస్ట్ పిట్‌లు నామమాత్రం కాకుండా పక్కాగా పని చేసేలా కనెక్షన్ చేయాలని, సచివాలయ కార్యదర్శులు పక్కగా తనిఖీ చేయాలని కోరారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం గ్రీనరికి కేటాయింపు ఉండాలన్నారు. ఆమె వెంట సిటీ ప్లానర్ మూర్తి, ఏసీపీలు అజయ్ కుమార్, బాబూరావు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ముస్తఫా
- 17వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: నియోజకవర్గంలోని శివారు ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా తెలిపారు. 17వ డివిజన్ శివారు ప్రాంతాలైన అమీన్ నగర్, తిరుమలాచారీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శివారు ప్రాంతాలు కావడంతో సైడు కాలువలు లేవలని, మురుగునీరు పారుదల లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిలిచిపోతుందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సైడు కాలువల నిర్మాణానికి ఇటీవల శంకుస్థాపన చేశామని త్వరలో కాలువల నిర్మాణాలు జరుగుతాయన్నారు. తిరుమలాచారీ కాలనీలో గత 25 సంవత్సరాలకు పై బడి నివాసముంటున్న తమకు ఆ స్థలాలు ప్రయివేట్ వారివని తెలుపుతూ కోర్టు నోటీసులు ఇచ్చారని, ఏమి చేయాలో తెలియడం లేదని ఎమ్మెల్యే ఎదుట వాపోయారు. ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉండటంతో, నోటీసులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన వాటికన్నా ఎక్కువగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షేక్ ఫర్జాన, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, యాదాల చిన్నా, వెంకటేశ్వరరెడ్డి, సామ్రాజ్యం, పద్మ, మస్తాన్‌వలి, నాగూర్, రాంబాబు పాల్గొన్నారు.

కార్పొరేటర్ కృష్ణారెడ్డి చిరస్మరణీయుడు

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లేళ్ల

నెహ్రూనగర్: కార్పొరేటర్ తనుబుద్ది కృష్ణారెడ్డి మృతి వైఎస్సార్ సీపీకి, పేద ప్రజానీకానికి తీరని లోటని శాసన మండలి సభ్యుడు లేళ్ల అప్పిరెడ్డి పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో కృష్ణారెడ్డి సంస్మరణ సభ మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సభకు డీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు(లాలుపురం రాము) అధ్యక్షత వహించారు. తొలుత కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ రెడ్డి పాలెంలో కృష్ణారెడ్డి విగ్రహ ఏర్పాటుకు కృషి చేస్తామని చెప్పారు. కృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా మాట్లాడారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, పార్టీ నేతలు నూరి ఫాతిమా, సత్యనారాయణరెడ్డి, ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), గీతా మందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, అంగడి శ్రీనివాసరావు, డాక్టర్ వై.షేక్, అత్తోట జోసఫ్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం పాలన

గుంటూరు మెడికల్: భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో చట్టసభల్లో అట్టడుగు వర్గాలను గుర్తించి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని ఏపీ హెల్త్, మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమ జ్యోతిబాబు అన్నారు. గత పాలకులు సామాజిక న్యాయం చేస్తామని గొప్పలు చెప్పడమే తప్ప, ఏనాడూ చేయలేదన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సామాజిక న్యాయం పాటిస్తూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను అమలు చేస్తున్న గొప్ప నాయకుడు అని వెల్లడించారు. ఎమ్మెల్సీ పదవుల్లో అన్ని వర్గాలను ముఖ్యంగా వెనుకబడిన కులాలను గుర్తించి అధిక సీట్లు కేటాయించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

శ్రీశ్రీ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్

పాత గుంటూరు: సమాజ మార్పుకోసం యువత శ్రీశ్రీ సాహిత్యాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. మంగళవారం రెడ్ బుక్ డే సందర్భంగా బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సాహితీ స్రవంతి, ప్రజాశక్తి సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 'శ్రీశ్రీ మహాప్రస్థానం సామాజిక దృక్పథం' అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. సభకు ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ శ్రీశ్రీ కవిత్వంలో పీడించబడే ప్రజలందరూ ఏకం కావాలనే దృక్పథం ఉందన్నారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ మాట్లాడుతూ శ్రీశ్రీ సాహిత్యం ప్రజలను అభ్యుదయ మార్గం నుంచి విప్లవ మార్గం వైపు పయనింప చేసిందన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం, ఖడ్గసృష్టి గ్రంథాలు సామాజిక చైతన్యాన్ని పెంచాయన్నారు. కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, విజ్ఞాన కేంద్రం ప్రతినిధి పాశం రామారావు, రచయిత గూడవల్లి నాగేశ్వరరావు, తాడికొండ నరసింహారావు, పి.డి.ఎస్.యు. రాష్ట్ర అధ్యక్షులు గనిరాజు, అవధానుల హరి, బి.వీరాస్వామి, సీపీఎం జిల్లా నాయకులు వై. నేతాజీ, కె.నళినికాంత్, ఎస్.భావన్నారాయణ పాల్గొన్నారు.

తెలుగు నాటకరంగ మూలస్తంభాలు పుస్తకావిష్కరణ



పాత గుంటూరు: లక్ష్మీపురంలోని త్యాగరాయ సాంస్కృతిక కేంద్రంలో అజోవిభో కందాళం ఫౌండేషన్, సంస్కృతి ఆధ్వర్యంలో మంగళవారం రచయితలు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, వాడ్రేవు సుందర్రావు రచించిన తెలుగు నాటకరంగ మూలస్తంభాలు పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. సభకు ఫౌండేషన్ ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత ఆచార్యులు డీఎస్ఎన్ మూర్తి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ విజయ్ భాస్కర్, వైఎస్ కృష్ణేశ్వరరావు, సర్రాజు బాల చందర్ పాల్గొన్నారు.

రామరాజుకు మాతృభాషా సేవా శిరోమణి పురస్కారం



మంత్రి బొత్స నుంచి పురస్కారం అందుకుంటున్న శ్రీనివాసరావు

పాత గుంటూరు: గుంటూరుకు చెందిన రామరాజు ఫౌండేషన్ చైర్మన్ రామరాజు శ్రీనివాసరావుకు మాతృభాషా సేవా శిరోమణి పురస్కారం లభించింది. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం నిర్వహించిన కార్యక్రమంలో విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి మంగళవారం అవార్డు అందుకున్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు అధ్యక్షత వహించారు. తెలుగు భాషాభిమాని అయిన శ్రీనివాస్ తమ ఫౌండేషన్ ద్వారా అనేక సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. అనేక మంది రచయితలు, కవులు, కళాకారులను సత్కరించారు. శ్రీనివాసరావుకు ఈ పురస్కారం లభించడం పై సాహితీ వేత్తలు భూసుర పల్లి వెంకటేశ్వర్లు, సోమేపల్లి వెంకట సుబ్బయ్య, కవులు సయ్యద్ జానీబాషా, బండికల్లు జమదగ్ని, ఆడిటర్లు దామచర్ల శ్రీనివాసరావు, వామనమూర్తి, సుబ్బారావు తదితరులు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



సభలో పాల్గొన్న పాపినేని శివశంకర్, వెంకటసుబ్బయ్య తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు డాక్టర్ మైలవరపు లలిత కుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పాల్గొని మాతృభాష ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు, పద్య కవి, గాయకుడు ఈ. వెంకటరెడ్డిలను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన 'మాతృభాష- ప్రాధాన్యం' వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. వల్లమన్నాటి నాగజ్యోతి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో దేవస్థానం ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ఎం సుభాని, నానా పాల్గొన్నారు. తొలుత బృందావన్ గార్డెన్‌లోని అన్నమయ్య పార్కులోని తెలుగుతల్లి విగ్రహానికి కవులు, రయితలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తెలుగు సాహిత్యంలో పద కవితా ప్రక్రియలు

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సాహిత్యంలో పద కవితా ప్రక్రియలు ఉన్నాయని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు తెలిపారు. జేకేసీ కళాశాలలో ఆడిటోరియంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రాచ్య భాషా విభాగ ఆధ్వర్యంలో సంగీత కచేరీ నిర్వహించారు. భాషపై పట్టు సాధించాలని సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించవచ్చని చెప్పారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ప్రముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు(తబలా), సుబ్రహ్మణ్యరాజు(వయోలిన్) వాయిద్య సహకారాన్ని అందించగా వల్లూరి తుషార పూర్ణవల్లి తన గాన మాధుర్యంతో తమదైన శైలిలో అలరించారు. అనంతరం ముగ్గురు కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, ప్రాచ్య భాషా విభాగాధిపతి కె.శంకర సాయిబాబు పాల్గొన్నారు.

ఎస్టీల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

నెహ్రూనగర్: తొలి నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేస్తున్న డాక్టర్ కుంబా రవిబాబును ఎమ్మెల్సీగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఎంపిక చేయటం రాష్ట్రంలోని లక్షలాది మంది గిరిజనులకు గర్వకారణమని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, జిల్లా విశ్రాంత అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మొగిలి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. నగరంలోని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీగా డాక్టర్ కుంభ రవిబాబు ఎంపికైన సందర్భంగా సీఎంకు వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ రాంబాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ నాయకుడు పాలపర్తి రామారావు మాట్లాడుతూ గిరిజన నాయకుడిగా డాక్టర్ రవిబాబు దశాబ్దాలుగా తమ సమస్యలపై పోరాడుతూ గిరిజనులందరినీ ఏకతాటిపై నడుపుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా రామకృష్ణ, వజ్రగిరి కొండలు, కె.వెంకటేశ్వర్లు, కట్ట పద్మ, ఫిరంగిపురం సర్పంచి బాబు పాల్గొన్నారు.

స్వర్ణ భారతినగర్‌లో ఎస్పీ పర్యటన

గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వర్ణభారతినగర్‌లో జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ మంగళవారం ఆకస్మికంగా పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్వర్ణ భారతి నగర్ మెయిన్ రోడ్ లో సీసీ కెమెరాలు, వీధిలైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు, అక్కడ షాపులు వారికి ఎలాంటి ఆటంకం కలగకుండా బ్లూ కోర్టు వాహనాన్ని, రక్షక వాహనాన్ని అక్కడ తిరుగుతూ నిరంతరం నిఘా ఉండాలని సీఐ శ్రీనివాసరావుకి ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట సీఐ నరసింహారావు, ఎస్పీ సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

మంగళగిరి: రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు కోరారు. ఏపీ చేనేత కార్మిక సంఘ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే ఆర్కేను నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం తరువాత అత్యధిక పెద్ద రంగం చేనేత రంగమని ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

రైల్వే ఉద్యోగుల నిరసన

తెనాలి రూరల్: కేంద్ర ప్రభుత్వ విధాలను వ్యతిరేకిస్తూ రైల్వే ఉద్యోగులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా రైల్వేమెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకరరావు చేపట్టిన ధర్నాకు మద్దతుగా సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ తెనాలి శాఖ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. తెనాలి పీడబ్ల్యూ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఉద్యోగులు నినాదాలు చేశారు. నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని అంటూ నినదించారు.

ట్రక్ ఆపరేటర్ ఖాళీలకు దరఖాస్తులు

నెహ్రూనగర్: గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రేషన్‌ను ఇళ్ల వద్దకు సరఫరా చేసేందుకు అవసరమైన ఎండీయూ ట్రక్ ఆపరేటర్స్ ఖాళీల భర్తీకి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. 31 జనవరి 2023 నాటికి 21-45 ఏళ్లలోపు ఉండి, 7వ తరగతి ఉత్తీర్ణతై, నెలకు రూ.12 వేలు ఆదాయము కలిగి, డ్రైవింగ్ లైసెన్స్ జారీచేసిన తేదీ నుంచి ప్రస్తుతానికి 2 సంవత్సరాలు పైబడి ఉన్న మైనారిటీ, క్రిస్టియన్ మైనార్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చొన్నారు.. దరఖాస్తులు ఈ నెల 23 నుంచి 27 వరకు గుంటూరు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయములోని ఉపాసెల్ విభాగంలో దరఖాస్తును అందజేసి రశీదు పొందాలని సూచించారు.

మత్తుతో విద్యార్థుల భవిత చిత్తు

చేబ్రోలు: విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలను వాడితే ఆరోగ్యపరంగా, భవిష్యత్తు పరంగా తీవ్రంగా నష్టపోతారని ఎన్‌ఫోర్స్‌మెంటు జిల్లా సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ అన్నారు. చేబ్రోలులోని చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వాడకం నిరోధంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ ఎస్.అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థి దశలో తెలిసీ తెలియక చేసిన తప్పు జీవితాన్ని బలితీసుకుంటుందన్నారు. డ్రగ్స్ వల్ల క్షణికానందం పొందినా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా సర్వం కోల్పోవలసి ఉంటుందన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్డురాయి ప్రతిష్ఠ

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ, చలమారెడ్డి పాలెం గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో చలమారెడ్డిపాలెంలో బొడ్డురాయి ప్రతిష్ఠా మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గత రెండురోజులుగా జరుగుతున్న కార్యక్రమాల్లో మంగళవారం బొడ్డురాయికి ప్రత్యేక పూజలు, నిర్వహించారు.

క్రైమ్ కార్నర్

హత్య కేసులో ముగ్గురికి పదేళ్లు జైలు

ఐదుగురికి ఏడాది శిక్ష

గుంటూరు లీగల్: హత్య కేసులో ముగ్గురికి పదేళ్ల జైలు, వెయ్యి రూపాయలు జరిమానా, ఐదుగురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.అర్చన సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు తాడికొండ మండలం పాములపాడు గ్రామంలో గారపాటి అబ్రహం, మాణిక్యరావు కుటుంబాల మధ్య కొన్ని రోజులుగా ఘర్షణ జరుగుతుంది. గ్రామ పెద్దగా ఉన్న గారపాటి బాలశౌరి గొడవలు మానుకోవాలని గారపాటి అబ్రహంకు సూచించారు. దీంతో గారపాటి బాలశౌరి తనకు అడ్డు వస్తున్నాడని అబ్రహం భావించాడు. ఈ క్రమంలో గారపాటి అబ్రహం, తన కుమారులు, బంధువులు దాదాపు 18 మందితో గారపాటి బాలశౌరి ఇంటిపై దాడి చేశాడు. ఇందులో గారపాటి బలశౌరి మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై మృతుడు గారపాటి బాలశౌరి కుమారుడు గారపాటి చిన్న 2015 జూలై 28న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి మంగళగిరి రూరల్ సీఐ సీహెచ్ కోటేశ్వరరావు విచారణ పూర్తి చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో మూడు, నాలుగు, ఐదో ముద్దాయిలైన తుమ్మలగుంట శౌరిబాబు, కొరివి నాగరాజు, దార్ల కోటేశ్వరరావుకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా, ఆరు, ఏడు, తొమ్మిది, పది, పదహారో ముద్దాయిలకు ఏడాది పాటు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ వి.సూరిబాబు కేసును వాదించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కొత్తకాలనీ మూడోలైనులో నివసించే నందిపాటి చంద్రశేఖర్ ఈనెల 15వ తేదీ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ కోసం వెతికినా కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న తండ్రి మోహన్‌రావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లాలాపేటలో బాలుడు..

బాలుడు కనిపించకుండా పోయిన ఘటనపై లాలాపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. చౌత్రా సెంటర్‌కు చెందిన ఐలం మణికంఠ కుమారుడు 13 సంవత్సరాల శివకుమార్ ఐదో తరగతి చదువుతున్నాడు. ఈనెల 20వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చాడు. బాలుడి ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఫలితం లేదు. తల్లిదండ్రులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఏటీ అగ్రహారంలో యువతి..

యువతి కనిపించకుండాపోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీఅగ్రహారంలో నివసించే ఓ కుటుంబానికి చెందిన 19 సంవత్సరాల యువతి మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

ఆన్‌లైన్ మోసంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన కె.సందీప్‌కుమార్ సెల్‌కు సోమవారం పాన్‌కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలని మెసేజ్ వచ్చింది. అనంతరం లింక్ వచ్చింది. సందీప్‌కుమార్ లింక్ నొక్కి వివరాలన్నీ పూర్తి చేశాడు. అనంతరం సందీప్‌కుమార్ అకౌంట్‌లోని రూ.2.11 లక్షల నగదు విత్‌డ్రా అయ్యాయి. బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వ్యక్తిపై దాడి

వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పొన్నూరు రోడ్డులో పఠాన్ అల్లాభక్షు తన షాపు ముందు కూర్చుని ఉండగా గుర్తుతెలియని యువకుడు షట్టర్‌ను చేతితో బాదాడు. అల్లాభక్షు అడ్డుకున్నాడు. ఆ యువకుడు ఇంటికి వెళ్లి మరో ఇద్దరిని వెంటబెట్టుకొచ్చి అల్లాభక్షుపై రాళ్లతో దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.